తెలంగాణకు కేరాఫ్ కేసీఆరే

- బీజేపీ, కాంగ్రెస్ నేతలకు పదవులు ఆయన పుణ్యమే
- కేసీఆర్ కృషి వల్లే నంబర్ వన్ స్థానంలో తెలంగాణ
- గ్యారెంటీల అమలులో కార్యాచరణ ఏదీ..?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయింది
- కృతజ్ఞతాసభలో ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి

కృతజ్ఞతా సభలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

హాజరైన నాయకులు, కార్యకర్తలు

మేడ్చల్/శామీర్‌పేట, జనవరి 30: తెలంగాణకు కేరాఫ్ కేసీఆరేనని, బీజేపీ, కాంగ్రెస్ నేతలకు పదవులు ఆయన పుణ్యమేనన్న విషయాన్ని గుర్తెరగాలని ఎమ్మెల్యేలు గుంట కండ్ల జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం ఆలియాబాద్ చౌరస్తాలో ఉన్న సీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఉమ్మడి శామీర్ పేట మండల కృతజ్ఞతా సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఉద్యమించి,తెలంగాణ రాష్ట్రాన్ని సాధించకుంటే పీసీసీ పదవులు, బీజేపీ నేతలకు రాష్ట్ర పదవులు వచ్చేవా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణను సాధించడమే కాదు, దేశంలోనే నంబరు వన్ స్థానంలో నిలిపారని ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, మల్లారెడ్డి అన్నారు.

కేంద్ర అవార్డుల్లో తెలంగాణ ముందంజ

ఒకప్పుడు పల్లెలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేవని, ఇప్పుడు కేంద్రం ఇచ్చే ఉత్తమ గ్రామ పంచాయతీల్లో ముందు వరుసలో ఉన్నాయన్నారు. ఇది కాదా అభివృద్ధికి నిదర్శనమని వారు ప్రశ్నించారు. ఒక ఇంటి సంసారాన్ని నిలబెట్టుకోవాలంటే అప్పులు చేయక తప్పదు, అలాంటి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే అప్పులు కావా అని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ గురించి అవాకులు పేలితే సహించబోమని వారు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎక్కువకాలం ఉండదని, తుమ్మితే ఊడిపోయే ముక్కే నన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని వారు పేర్కొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

బీఆర్ఎస్ కార్యకర్తలను, నాయకులను కాపాడుకుంటామని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అధికారాన్ని కోల్పోయామని అధైర్య పడవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందన్నారు. 60 రోజుల్లోనే ఆ ప్రభుత్వ పనితీరు, చేతగాని తనం తేలిపోయిందన్నారు. ఇప్పటి వరకు రైతుబంధుకు దిక్కులేదన్నారు. ఎంపీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సంసిద్ధం కావాలని ఆయన శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి, నాయకులు భద్రారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, తూంకుంట మున్సిపాలిటీ చైర్మన్ కారింగుల రాజేశ్వర్ రావు, పార్టీల అధ్యక్షులు సుదర్శన్, నోముల శ్రీనివాస్ రెడ్డి, మల్లేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, అనిల్ రెడ్డి, ఎంపీపీలు ఎల్లుబాయి, హారిక, జడ్పీటీసీ సభ్యులు అనిత, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, నర్సింహ రెడ్డి, నూనె ముంతల రవీందర్ గౌడ్, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్లు

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కాప్రాడివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజుతో పాటు దర్వల్లి రాజశేఖర్, సీఎన్‌రెడ్డి, జితేంద్రనాథ్, జగదీశ్‌గౌడ్, రజితరెడ్డి, విజయారెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. – కాప్రా, జనవరి 30

క్రీడల్లో గెలుపోటములు సహజం

క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిని గెలుపునకు మెట్టుగా భావించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సూచించారు. ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో జరుగుతున్న 7వ రాష్ట్ర క్రీడలు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఓటమితో కుంగిపోవద్దని, జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం క్రీడ ల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. – మేడ్చల్, జనవరి 30

ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

పిల్లలతో జ్యోతి (ఫైల్)

జవహర్‌నగర్, జనవరి 30: ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం కథనం ప్రకారం... కార్పొరేషన్‌లోని దేవేందర్‌నగర్‌లో ఈరి బాలు, భార్య జ్యోతి, ముగ్గురు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. ఈనెల 29న బాలు విధులకు వెళ్లగా... భార్య జ్యోతి(28) ముగ్గురు పిల్లలతో కలిసి బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. విధులు ముగించుకొని ఇంటికి వచ్చిన బాలు భార్య పిల్లలను చూడగా కనిపించలేదు. దీంతో వారి ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. భర్త బాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేఎల్ఎన్ఎస్‌నగర్ బాధితులకు స్టే ఆర్డర్ పత్రాలు పంపిణీ

నేరేడ్‌మెట్, జనవరి 30: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జయగిరి లక్ష్మీసరసింహస్వామి నగర్‌లో నివాసం ఉంటున్న కాలనీవాసుల ఇండ్లకు సంబంధించి దేవాదాయశాఖ అధికారులు ఇచ్చిన నోటీసులను నిలుపివేయాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కోర్టు ప్రస్తుత పరిస్థితిని కొనసాగించాలని తెలుపుతూ స్టే ఆర్డర్ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు ఆర్డర్‌కు పత్రాలను ఎమ్మెల్యే, కార్పొరేటర్ మేకల సునీతతో కలిసి బాధితులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ వాసులకు రానున్న ఐదేండ్లలో ఎటువంటి ఇబ్బంది కలిగినా తమ ఇండ్లకు సంబంధించి ఒక్క ఇటుక కూడా కదిలించకుండా చూసే బాధ్యతనాదేనని హామీ ఇచ్చారు. అనంతరం స్థానికులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాముయాదవ్, సత్యనారాయణ, షేక్, కృష్ణగౌడ్, అనిల్, రాజా, అనిత, బాచి, మల్లేశ్ యాదవ్, నర్సింహరావు, సిద్ధిరాములు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు చర్యలు

ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఐఎన్ నగర్‌లో ఎత్తైన ప్రదేశానికి తాగునీటిని అందించడానికి బూస్టర్‌ను ఏర్పాటును ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడ నీటికి ఇబ్బంది ఉన్నా వెంటనే నాదృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టే ఆర్డర్ పత్రాలను బాధితులకు అందిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ సునీత

ప్రభుత్వ భూములు
కబ్జా చేస్తే చర్యలు

మల్కాజిగిరి, జనవరి 30: ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడుతామని అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మచ్చ బొల్లారం డివిజన్ శ్రీనగర్ కాలనీలోని పార్కును అక్రమంగా కబ్జాచేసి పిల్లర్లు నిర్మించినట్లు గుర్తించిన టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీతో కూల్చి వేయించారు. ఈ సందర్భంగా డీసీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా సెల్లార్లు, భవనాలతో పాటు ఇతర కట్టడాలపైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఆలయ ఈవోను దూషించిన వ్యక్తిపై కేసు

మేడ్చల్, జనవరి 30: ఆలయ ఈవోను దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఉన్న గట్టుమైసమ్మ ఆలయ ఈవో భాగ్యను రెండు రోజుల క్రింతం ఆలయానికి వచ్చే విరాశల విషయంలో ఆ ప్రాంతానికి చెందిన యాదగిరియాదవ్ ఈవోతో వాగ్వివాదా నికి దిగాడు. అంతటితో ఆగకుండా దుర్భాషలాడుతు విధులను ఆటంకపరిచాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మల్కాజిగిరి, జనవరి 30: విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని శరత్‌చంద్ర ఫౌండేషన్ డైరెక్టర్ కేఎం రాణి సూచించారు. మంగళవారం మల్కాజిగిరిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని టెన్త్ విద్యార్థులకు వార్షిక పరీక్షల కోసం అవగాహన కల్పించి స్టడీ బుక్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ వీరేశం,అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వప్నజ్యోతి, కార్పొరేటర్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలి

కుష్టు వ్యాధి నిర్మూలను ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. మంగళవారం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ముదిరాజ్, డాక్టర్ సౌందర్యలత, ఎండీ సిగ్మతుల్ల, కరుణదేవి, ప్రకాష్, గొంగిడయ్య, యాదమ్మ, పద్మ, ప్రమీల, ఆకుల మహేందర్, కొండల్‌రెడ్డి, నరేశ్, మాస శేఖర్, దయాకర్‌రెడ్డి, నిరంజన్, కిశోర్, మందశేఖర్, సుక్క కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న ఆరోగ్యకార్యకర్త బత్తిని మంగమ్మను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఘనంగా సన్మానించారు. – రామంతాపూర్, జనవరి 30

నాగారంలో సెక్షన్ కమ్ జెట్టింగ్ మెషిన్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

మున్సిపాలిటీ పరిశుభ్రతకు ప్రాధాన్యత

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 30: మున్సిపాలిటీ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద రూ.39.89 లక్షలతో కొనుగోలు చేసిన సెక్షన్ కమ్ జెట్టింగ్ మెషిన్ (మ్యాన్ హోల్ క్లీనింగ్)యంత్రాన్ని మంగళవారం చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో మ్యాన్ హోల్స్ ఓవర్ ఫ్లో అయితే ప్రజలు 9640010053 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, మేనేజర్ కే.చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ కోత

కీసర, జనవరి 30: కీసర మండలం చీర్యాల్ 33/11కేవీ విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల నుంచి చీర్యాల్, ఎస్ఎల్ఎన్ హోమం, రోజ్ గార్డెన్, ఎన్ఎస్ఆర్, ఎస్ఎల్ఆర్ కాలనీ, శ్రీ బాలాజీ ఎన్క్లేవ్, గణేశ్ టౌన్‌షిప్‌కాలనీలతో పాటు వ్యవసాయ బావులకు కూడా విద్యుత్ కోత విధిస్తున్నామన్నారు. తిమ్మాయిపల్లి ఫీడర్ పరిధి మధ్యాహ్నం 2నుంచి సాయత్రం 4 గంటల వరకు తిమ్మాయిపల్లి, ధర్మారం, నర్సంపల్లి, ఫారెస్ట్ రెంజ్, సైలెంట్ వార్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోత విధిస్తున్నామని ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

బోడుప్పల్ ఫీడర్ పరిధిలో..

రామంతాపూర్: బోడుప్పల్ ఫీడర్ పరిధిలోని మెయిన్ రోడ్డు భరత్‌నగర్, శ్రీరామాకాలనీ, ఎస్‌కె హెచ్ దవాఖాన ఏరియా, కుమ్మరి బస్తీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండని అధికారులు తెలిపారు.అదేవిధంగా సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు హబ్సిగూడ వీధినంబర్ 8, వెలుగు గుట్ట, ఎస్‌కేవాక్, సర్వేప్ ఇండియా, సీసీఎంబీ, గ్రీన్ హి ల్స్ కాలనీ, విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

బస్తీల్లో పోలీస్ గస్తీని పెంచుతాం

మల్కాజిగిరి, జనవరి 30: బస్తీల్లో పోలీస్ గస్తీని పెంచుతామని అల్వాల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రహుల్ దేవ్ హామీ ఇచ్చారు. మంగళవారం వెంకటాపురం డివిజన్ ఇందిరానగర్ బస్తీలో పోలీస్ గస్తీని పెంచాలని కోరుతూ ఇన్‌స్పెక్టర్‌కు స్థానికులు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారిని సన్మానించారు.

9న నాగారం తైబజార్ వేలం

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 30: నాగారం మున్సిపల్ పరిధిలోని నాగారం, రాంపల్లి తైబజార్ల వేలం పాటను 2024-2025 సంవత్సరానికి గాను ఫిబ్రవరి 9న నిర్వహిస్తున్నామని కమిషనర్ రాజేందర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు వచ్చేనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు (కమిషనర్ నాగారం మున్సిపాలిటీ) పేరుపై రూ.2 లక్షల డీడీ తీసి మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుచేసుకోవాలని సూచించారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి

కాప్రా సర్కిల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్కాజిగిరి చౌరస్తాలో గాంధీ పార్కులోని మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

కాప్రా/మేడ్చల్ కలెక్టరేట్/మల్కాజిగిరి, జనవరి 30: మహాత్మా గాంధీ వర్ధంతిని ఉప్పల్, మేడ్చల్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో ఆయా పార్టీల నేతలు, ప్రజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహాలకు,చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మల్కాజిగిరిలోని గాంధీ పార్కు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలవేసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. కాప్రా సర్కిల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో సంస్మరణ దినం సందర్భంగా అధికారి హరిప్రియ, జిల్లా అధికారులు, ఉద్యోగులు అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతంర రెండు నిమిషాలు మౌనం పాటించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

మేడ్చల్, జనవరి 30: బీటెక్ చదువుతున్న పేద విద్యార్థులకు మనోహర్ ట్రస్టు, అమెజాన్ ఎంప్లాయిస్ ఆర్థిక సాయం చేశారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి కళాశాలకు చెందిన విద్యార్థులు భార్గవ చారి, ముఖేశ్ సాయి పేద విద్యార్థులకు రూ.70 వేలు చెక్కును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మనోహర్ ట్రస్టు అధ్యక్షుడు అనంత కుమార్, అమెజాన్ ప్రతినిధి భాగ్య, హెచ్‌వోడీ పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ల అరెస్టు

నేరేడ్‌మెట్, జనవరి 30: ఈనెల 28వ తేదీన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ కృపాకాంప్లెక్స్ సమీపంలో జరిగిన చైన్ స్నాచింగ్ దొంగలను నేరేడ్‌మెట్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితులు సుమీత్ నాయక్ తాడుబండ్ అంబేద్కర్‌నగర్, మహమ్మద్ ఖరీముద్దీన్,బోలక్‌పూర్ చెందినవారుగా పోలీసులు గుర్తించారు. వారి నుంచి 3.5 తులాల బంగారం, నాలుగు ఫోన్లు, బైక్‌ను స్వాధీన చేసుకున్నారు.

అల్వాల్ డివిజన్ ముత్యంరెడ్డి నగర్ కాలనీలో పాదయాత్రచేసి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి

పార్కుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

మల్కాజిగిరి, జనవరి 30: పార్కుల్లో మౌలి క సదుపాయాలు కల్పిస్తామని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి అన్నారు. మం గళవారం ముత్యంరెడ్డి నగర్ కాలనీలో కార్పొరేటర్ పాదయాత్రచేసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలైన్, స్ట్రీట్ లైట్లతోపాటు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమం వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ సతీష్, హార్టికల్చర్ ఆఫీసర్ రాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చెందు, మల్లేశ్, అరుణ్, జామ, ప్రేమ్, సంతిల్, వీఎన్ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు విధానంపై రైతులకు అవగాహన

శామీర్‌ఏట, జనవరి 30: రైతులు సాగు విధానంపై అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ జాము రవి సూచించారు. అలియాబాద్, మూడుచింతలపల్లి రైతు వేదికల్లో మంగళవారం వివిధ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవోలు మాట్లాడుతూ రైతులు వరి నాటు వేసే వారం ముందు నారుమడిలో కార్బోబ్యూరాన్ గుళికలు 3 కిలోలు వేయాలన్నారు.కాండం తొలుచు పురుగు నివారణకు వరి నాటు వేసేన 15 రోజులకు కార్టప్ హై క్రోక్లోరైడ్ గుళికలు 8 కిలోలు లేదా క్లోరంత్ర నిలిప్రోల్ గుళికలు 4 కిలోలు ఇసుకలో కలిపి చల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు సీహెచ్.రమేశ్, కృష్ణవేణి, ఏఈవో రవియాదవ్, రైతులు కృష్ణారెడ్డి, దన్‌రాజ్‌నాయక్, భూమిరెడ్డి, బిక్షపతి, జగన్ మోహన్‌రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి రమేశ్

అక్రమ నిర్మాణదారుడి దౌర్జన్యం

జవహర్‌నగర్, జనవరి 30: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేయడమే కాకుండా... విధి నిర్వహణలో ఉన్న మహిళా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై ఓ అక్రమ నిర్మాణదారుడు దాడికి యత్నించాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, రెవెన్యూ సిబ్బంది కథనం ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని గబ్బిలాల్‌పేట్ ప్రాంతంలోని సర్వే నం. 292లోని ప్రభుత్వ భూమిలో కొద్ది కాలంగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో రెవెన్యూ అధికారులు మంగళవారం అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేసేందుకు ప్రయత్నించడంతో అక్కడే ఉన్న అక్రమ నిర్మాణదారుడు మల్లేశ్ రెవెన్యూ మహిళా ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మిని అడ్డుకుని దాడి చేసే ప్రయత్నం చేశాడు. విధులకు ఆటంకం కలిగించిన అక్రమ నిర్మాణదారుడిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన నిర్మాణానికి 2 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలంటూ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డికి మంగళవారం మండల అంబేద్కర సంఘం నేతలు కొమ్ము సుదర్శన్, తుడుం శ్రీనివాస్‌లతో పాటు పలువురు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. – కీసర, జనవరి 30

నంబరు ప్లేట్లపై స్టిక్కర్లు అతికించిన వారిపై కేసు

మేడ్చల్, జనవరి 30: నంబరు ప్లేట్లు లేకుండా, స్టిక్కర్, పేపరు అతికించిన వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డులో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో చలానాలను తప్పించుకునేందుకు నంబరు ప్లేటు లేకుండా, నంబరు ప్లేట్‌కు పేపరు, స్టిక్కర్ అతికించిన ఆరు వాహనాలను గుర్తించారు. వాటి యజమానులపై కేసు నమోదు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

బీఆర్ఎస్ హయాంలో గ్రామాలు అభివృద్ధి

మేడ్చల్, జనవరి 30: బీఆర్ఎస్ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ రజితా రాజమల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండల సర్వసభ్య సమావేశంలో మంగళవారం ఎంపీపీ రజితారాజమల్లారెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో పలు శాఖల పనితీరు, కార్యక్రమాల అమలుపై సమీక్షించారు.

రెండు రోజుల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనున్న సందర్భంగా ఎంపీపీ రజితా రాజమల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజావిజయేందర్ రెడ్డి సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి కోరారు. మండల సభలో పాల్గొన్న ఆయ న ప్రమాదాలు జరుగుతున్న తీరును వీడియోల ద్వారా అవగాహన కల్పించారు.

15 రోజుల పాటు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించనున్నట్టు మండల వైద్యాధికారి శైలజ తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శైలజావిజయానందారెడ్డి, ఎంపీడీవో పద్మావతి, డబిల్‌పూర్ పీఏసీఎస్ చైర్మర్ సురేశ్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ రజితారెడ్డి, జడ్పీటీసీ శైలజారెడ్డి, ఎంపీడీవో పద్మావతి

PUBLIC NOTICE

This is to inform the general public that **Shailesh Yadav** is the owner of **H.No. 8-832/10/A/1, land admeasuring 888 sq.yds., Gramkantam, situated at Ayyappa Colony, Lalbagh, Jawahar Nagar Village, Kapra Mandal, Medchal - Malkajgiri District** and has approached **Unity Small Finance Bank Ltd** for financial assistance by offering the above mentioned property as security.

Whosoever has got any claims or rights over the above mentioned property. Please contact J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.

పబ్లిక్ నోటీస్

నా క్లయింట్ పి. రాజ్ కుమార్ అతని కుటుంబ సభ్యులు ఇంటి నం. 3-3-64/B5/3, PTI No. 1020310072 మరియు ఇంటి నం. 3-3-64/B5/NR, PTI No. 1020313135 ప్లాట్ నం. 3, Part సర్వే నం. 186/Part, 79.5 చదరపు గజములు గల రామంతాపూర్ లోని ఎండోమెంట్ కాలనీలోగల ఇల్లు ఉమ్మడి ఆస్తి యాజమాన్యానికి సంబంధించినది. ఇట్టి ఆస్తిని పి. పవన్ కుమార్‌కు అమ్ముటకు ఎటువంటి హక్కు లేదు. అతను స్వష్టించుకున్న దస్తావేజులు చెల్లనేరవు.

ఈ పై ఇంటిని ఎవరైన కొనినచో నష్ట పోవుదురు మరియు నా క్లయింట్ తీసుకునే చట్టపరమైన చర్యలకు బాధ్యులు కాగలరు.

సం/- ఓగిరాల రమేష్, కే. సుజాత, వి. అనిల్ కుమార్, అడ్వకేట్‌లు

#3-14-16, శ్రీనివాసపురం, రామంతాపూర్, హైదరాబాద్-500013. సెల్: 9246153206